క్లుప్తంగా

వీపీటీజీలను ఓటర్లుగా చేర్పించాలి



సమావేశంలో బూత్‌లెవల్ అధికారులతో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

చింతపల్లిరూరల్: పీవీటీజీ యువతీయువకులను ఓటర్లుగా చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సీనియర్ సహాయకులు కె.చిన్నయ్య పడాల్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యలయంలో బూత్‌లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కోదూ,పోర్జా,గడభ తదితర కులాల్లో 18 సంవత్సరాల నిండిన యువతీ,యువకులకు ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు గోవింద్,కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సెక్యూరిటీ గార్డు మృతికి సంతాపం



శ్యాంసుందర్(ఫైల్)

రాజవొమ్మంగి: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న ముంగారి శ్యామ్ సుందర్ (41) బుధవారం అర్ధరాత్రి ఇంటి వద్ద గుండెపోటుతో మరణించాడు.ఇతనికి భార్య, ఏడాది వయస్సుగల కుమారుడు ఉన్నారు. రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆర్.మహేశ్వరెడ్డి, సబ్‌మేనేజర్ లోవరాజు,సిబ్బంది ఆ కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. తక్షణ సహాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ కొంగర మురళీకృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు శ్యాంసుందర్ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

సాలభంలో ఘనంగా భారిజం పండగ



సాలభంలో నృత్యాలతో సందడి చేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: గిరిజన సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం మండలంలోని సాలభం పంచాయతీ కేంద్రంలో గురువారం భారిజం పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు తమ ఆచార వ్యవహారాలను పాటిస్తూ పూర్వీకులు ఉపయోగించిన ఆయుధాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ పండగను ప్రతీ మూడు సంవత్సరాల ఒకసారి సంక్రాంతి తరువాత నిర్వహించడం ఆనవాయితీ. చావడి వద్దకు గ్రామస్తులందరూ చేరి డప్పు వాయిద్యాల నడుమ సింగటి పాట పాడుతూ నృత్యాలు చేశారు.థింసా, గిరిజన సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐసరం హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మత్స్యకొండబాబు, మన్మధరావు, నాయుడు పాల్గొన్నారు

కొనసాగుతున్న సంక్రాంతి సంబరాలు



థింసా నృత్యం చేస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి

డుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. సొవ్వ పంచాయతీలో గురువారం పర్యటించిన ఎంపీపీ బాక ఈశ్వరి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులతో కలిసి థింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంప్రదాయలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్,నర్సింగ్‌రావు, సునీల్,బాక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ఆదర్శంగా సీఎం జగన్



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



దుమగుడ్రిలో అడ్డాకుల్లో అంబలి తాగుతున్న ఎమ్మెల్యే పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అమలు చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని మారుమూల ఐనాడ గ్రామ సచివాలయం పరిధిలోని గడ్డిబందలు, నేరేళ్ళ,గునగుమ్మి,తోటగరువు,గిన్నిగరువు,జంగిడాపల్లి,పూతికగరువు,పెద్దపాలం,వంటర్లపాడు,కొండంగిపుట్టు,బలమాలు,గుల్లిపల్లి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ గ్రామాల్లోని 126 గడపలను ఎమ్మెల్యే సందర్శించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను గిరిజనులకు పంపిణీ చేశారు.అన్ని గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. విద్య,వైద్య,ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల గిరిజనులకు మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రైతుభరోసాతో గిరిజనులకు వ్యవసాయ పెట్టుబడి నగదు పెద్ద మొత్తంలో అందుతోందని తెలిపారు. అటవీభూములను పంపిణీ చేయడంతో పాటు ఆయా భూముల్లో వ్యవసాయాభివృద్ధికి రైతుభరోసాను అమలు చేయడం చరిత్రాత్మకమన్నారు. 90శాతం సబ్సిడీపై వరితో పాటు రాజ్‌మా విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేసినట్టు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలలు,ఆస్పత్రులను నాడు–నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసి,మౌలిక సదుపాయాలు కల్పించినట్టు ఆమె తెలిపారు. గిరిజనులంతా అభివృద్ధి నినాదంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరింత ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు,సర్పంచ్‌లు జి.భీమాలమ్మ, పాంగి రాంబాబు, గెమ్మెలి అప్పలకొండబాబు,వంతాల రాంబాబు, జి.నీలకంఠం, బసవన్నదొర, ఎంపీటీసీలు టి.ఎర్రయమ్మ,సీహెచ్.మీన,లకే రామకృష్ణపాత్రుడు,మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, కన్నాపాత్రుడు, గంగరాజు, సచివాలయాల పరిధి కన్వీనర్లు ఈశ్వరరావు,కృష్ణ,మంగమ్మ,రాంనాయుడు,వేమలగోపి,దశమూరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

ఐనాడ పంచాయతీలో రెండు రోజులపాటు ఇంటింటా తిరిగి తోటి గిరిజనులతో మమేకమైన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులను గిరిజనులు ఘనంగా సన్మానించారు.ఐనాడ పంచాయతీ సర్పంచ్ జి.భీమాలమ్మ,ఎంపీటీసీ సభ్యురాలు ఎర్రయమ్మ, గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే దంపతులకు దుశ్శాలువాలు కప్పి,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండలంలో మాదల పంచాయతీలోని గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దుమగుడ్రి,నందివలస, ములియగలుంగు, నందివలస హౌసింగ్ మోడల్ కాలనీలో 230 గడపలను సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన టీడీపీ మద్దతుదారు అయిన మాదల సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు ఆపార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆయా గ్రామాల ప్రజలు థింసా నృత్యాలతో ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు చెప్పారు.

తాగునీటి పథకానికి నిధులు మంజూరు

స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు రక్షిత తాగునీటి పథకానికి ఎమ్మెల్యే రూ.12 లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పాల్గుణ గ్రామస్తులతో కలిసి కొద్దిసేపు థింసా నృత్యం చేశారు.వారు తయారు చేసిన చోడి అంబలిని ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు అడ్డాకుల్లో తాగారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధారస్వామి, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లఫోరం మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, సీనియర్ నాయకులు సన్యాసి, గురుమూర్తి,గోపాల్,శెట్టి అప్పాలు,రఘునాథ్, కిరణ్, రంజిత్‌కుమార్,హస్తినకుమార్,గురు పాల్గొన్నారు.

నేడు వంచంగిలో 'గడప గడపకు'

రాజవొమ్మంగి : మండలంలోని వంచంగి పంచాయతీ పరిధిలోని జి. కొత్తపల్లి, వంచంగి, బలిజపాడు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరుకానున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మండలస్థాయి అధికారులు, వలంటీర్లు , సచివాలయసిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

21న కొత్తాడ పంచాయతీలో..

గంగవరం: కొత్తాడ పంచాయతీలో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, విధిగా హాజరుకావాలన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న శివప్రసాద్

కొయ్యూరు: నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ గురువారం రత్నంపేట యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీ మాధవి సూచనల మేరకు కిట్లు అందజేశారు.ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ యువకులు ఆటల్లో రాణించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు

వచ్చేనెల 3 నుంచి సీతారామ విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు

జి.మాడుగుల: చింతపల్లి మండలం కృష్ణాపురంలో వచ్చేనెల 3,4,5 తేదీల్లో సీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు పాకలపాటి గురుదేవుల భక్తుల సంఘం అధ్యక్షుడు మత్స్యరాస మత్స్యరాజు తెలిపారు. చింతపల్లి మండలం బెన్నవరం గ్రామంలో గురువారం గిరిజన పెద్దలకు, ప్రజలకు ఆహ్వాన పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకలపాటి గురుదేవుల ఆశ్రమంలో రామనందస్వామి సమక్షంలో విగ్రహాల ప్రతిష్టానపై చర్చించినట్టు చెప్పారు. హిందూ దేవాలయాలను కూల్చడం, దేవాలయ భూములు అన్యాక్రాంతం చేయడానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎంసీ మాజీ చైర్మన్ గాయత్రి, కర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రామానందస్వామితో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న ఎస్ఐ చినబాబు

గంగవరం: లైఫ్ కేర్ ఫౌండేన్ వార్షికోత్సవం సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు స్నేహాజగ్విందర్ ఆధ్వర్యంలో పాతరామవరంలో వివిధ క్రీడాపోటీలను నిర్వహించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో విజేతలకు గురువారం స్థానిక ఎస్ఐ చినబాబు, రాజమండ్రి ప్రతిభ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవరావు , లైఫ్ కేర్ ఫౌండేషన్ అధ్యక్షులు అమూల్య బహుమతులు అందజేశారు.

వైఎస్సార్ హెల్త్ కిట్ల పంపిణీ

చింతపల్లి రూరల్: వైఎస్సార్ హెల్త్ కిట్లను గర్భిణులు,బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె స్థానిక ఐసీడీసీ సీడీపీవో రమ్యతో కలసి మండలంలో బౌర్తి,వామగడ్డ కొత్తురు,అంతర్ల,పెంటపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హెల్త్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం వామగడ్డ కొత్తూరు, పెంటపాడు గ్రామాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు.నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరింటెండెంట్ రామచంద్రమూర్తి పాల్గొన్నారు.



బాలింతకు వైఎస్సార్ హెల్త్ కిట్ అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

యోగి వేమనకు ఘన నివాళి

సాక్షి,పాడేరు: యోగి వేమన జయంతిని స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు.యోగి వేమన చిత్రపటం వద్ద ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకర్,గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావులు జ్యోతి ప్రజ్వలన చేసి,పూలమాలలతో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి హేమలత, రిటైర్డ్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యోగివేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ఏపీవో,గిరిజన సంక్షేమ డీడీ

20,21 తేదీల్లో విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

రంపచోడవరం: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వార్షిక ఆదాయ అవసరాలు, విద్యుత్ ధరలపై ఈ నెల 20,21 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్(ఆపరేషన్ సర్కిల్) టి.వి.ఎస్.ఎన్. మూర్తి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన గోరేవారు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



డి.యర్రవరం సచివాలయంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు హెచ్చరించారు. మండలంలో డి.యర్రవరం, ఎం.బెన్నవరం గ్రామ సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ఏవిధంగా సేవలందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్లో పెండింగ్ సమస్యలను స్వయంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను పరిశీలించి యుద్ధప్రాతిపదికన బాగు చేయించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇల్లు నిర్మించుకుంటే సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. మండల వ్యాప్తంగా ఇంతవరకు 400పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, మరో 758 ఇళ్ల పనులు వివిధ దశలో ఉన్నాయన్నారు. గడువు లోపు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు చేస్తామన్నారు. డి.యర్రవరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులు పరిశీలించి వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు కె. శ్రీనివాస్, సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థాలు

బుచ్చెయ్యపేట: ఆర్.భీమవరంలో రామాలయ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గులు, ఎడ్ల పరుగు పందెం, చిడతలు, తప్పెటగుళ్లు, కుర్చీల పోటీలు ఆకట్టుకున్నాయి. చిన భీమవరం, ఎం.బి.పాలెం, మల్లాం , శివరాంపురం తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది. పలు ఆటల పోటీల్లో విజేతలకు ఉత్సవ కమిటీ,గ్రామపెద్దలుబహుమతులు ప్రదానం చేశారు.

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సీతారాముల తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద స్వామివారి చెట్టు భజన వద్ద పూజలు చేశారు. తోడ పెద్దు సేవ నిర్వహించారు. అదే రోజు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కె.కోటపాడు: మండలంలోని సూర్రెడ్డిపాలెంలో దుర్గాలమ్మ, కె.సంతపాలెంలో నాగదుర్గాలమ్మ అమ్మవార్ల తీర్థాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామాల్లో భక్తులు ఉదయం నుంచే అమ్మవార్ల ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేరోజు రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రోలుగుంట: బల్జిపాలెం సీతారాముల తీర్థం వైభవంగా నిర్వహించారు. రామాలయంలో సర్పంచ్ మామిడి అప్పలనర్స దంపతులు పూజలు చేశారు. కుసర్లపూడిలో బుధవారం సీతారాముల ఉత్సవాన్ని, గురువారం గౌరీపరమ్మేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పందెంరాయుళ్ల అరెస్టు

చోడవరం రూరల్: ముద్దుర్తిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో గ్రామ శివారులోని కళ్లం పాకల వద్ద పేకాడుతున్న వారిపై దాడి చేశారన్నారు. వీరి నుంచి రూ.7,560 స్వాధీనం చేసుకున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ముద్దుర్తి రామాలయం వద్ద బహిరంగ ప్రదేశంలో బల్లాట ఆడుతుండగా ఎస్ఐ అప్పలనాయుడు దాడిచేసి ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,300 స్వాధీనం చేసుకున్నారని సీఐ పేర్కొన్నారు.

రక్తహీనత నివారణపై శిక్షణ

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య, సచివాలయ సిబ్బందికి రక్తహీనత గుర్తింపు, నివారణపై గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రధానంగా సిబ్బంది పది నుంచి 19 ఏళ్లలోపు రక్తహీనత బాలికలను గుర్తించి వారు సంపూర్ణ ఆహారం తీసుకునేలా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది బృందంగా ప్రతి నెలా మూడు గ్రామ సభలు నిర్వహించి పై వయసు వారిని చైతన్యపరచాలన్నారు. కౌమార దశలో వచ్చే మార్పులపైన, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వైద్యాధికారి ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో ప్రభాకరరావు, వైద్యాధికారి ధనలక్ష్మి

అంగరంగ వైభవంగా కనకమ్మ జాతర

- తండోప తండాలుగా తరలివచ్చిన జనం
- ఉర్రూతులూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కనకమహలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు



జాతరలో జనం కోలాహలం

యలమంచిలి : కనకమహలక్ష్మి అమ్మవారి జాతర గురువారం ఇక్కడ అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా జనం జాతరకు తరలిరావడంతో యలమంచిలి జన సంద్రంగా మారింది. ముఖ్యంగా జాతర జరుగుతున్న ధర్మవరం కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయ పరసరాలు రాజీవ్ క్రీడా మైదానం, యలమంచిలి ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఈ జాతరలో సూదూర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు గృహావసరాలకు కావలసిన వస్తు సామాగ్రి, దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు, జెయింట్‌వీల్స్ ,జారుడు బల్లలు వంటి చిన్నారులను అలరించాయి. యలమంచిలి జాతీయ రహదారి ధర్మవారం వీధుల్లో ఏర్పాటు చేసిన వివిధ విద్యుత్ సెట్టింగ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు ,నేల వేషాలు కోలాటాలు,అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ , ఎస్ఐ కె. పాపినాయుడు, రూరల్ ఎస్ఐ కె. సన్నిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు

ఉదయం 6 గంటల నుంచి మహిళలు అధిక సంఖ్యలో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చి కనకమహలక్ష్మి అమ్మవారికి చీర, రవిక, గాజులు, కుంకుమ, పసుపు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కొఠారు సాంబశివరావు, పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నబాబురాజు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, కౌన్సిలర్లు కొఠారు కొండబాబు, పిట్టా సత్తిబాబు, గొర్లె వెంకట్,మరిణేశ్వరావు, రాపేటి సంతోష్ గంధం శివ, వియ్యపు సత్తిబాబు పాల్గొన్నారు

బోన్‌మేరో బాధితుడికి ఆర్థిక సాయం



నీరజ్ తల్లిదండ్రులకు నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

రావికమతం: బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కొత్తకోట హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి గర్రెడ్డి నీరజ్ వైద్య ఖర్చుల నిమిత్తం విశాఖకు చెందిన స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ రూ.12 వేల నగదును గురువారం అందించింది. పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి ఆ సంస్థ సభ్యులు ఈ సాయం చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న నీరజ్‌కు రక్తమార్పిడి చేయాల్సి ఉంది. దీనికి రూ.30 లక్షలు ఖర్చవుతుంది. ఇటీవల నర్సీపట్నం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని కలవగా నీరజ్‌కు ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల చెక్కు అందించారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి వైద్యం చేయించుకున్న ఆ కుటుంబం ఆర్థికంగా చిదిగిపోవడంతో పలువురు దాతలు ముందుకొచ్చి సాయమందిస్తున్నారు.